తెళ్ళూరు నాగేశ్వరరావు  ఆధునిక నీతికథలు

పుట్టింది, పెరిగింది పల్లెటూరైనా రాంకోటయ్య కొడుకు కృష్ణప్రసాద్ ఆర్.ఇ.సి లో ఎం.టెక్ చదివాడు. ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. డిస్టింక్షన్ తెచ్చుకున్నాడు. కాని ఏ ఉద్యోగానికీ దరఖాస్తు పెట్టలేదు. అతని ఆశయం అమెరికా వెళ్ళాలని; పై చదువులు చదవాలని; అక్కడే ఉద్యోగంచేసి లక్షలకు లక్షలు డబ్బు సంపాదించాలని. మనస్సులో ఆ ఉద్దేశం ఉండబట్టే 'టోఫెల్' పరీక్షకు కూర్చున్నాడు. మరీ అత్తెసరు మార్కులు కాకుండా అర్హతమేరకు మార్కులు తెచ్చుకున్నాడు. జి.ఆర్.ఇ పరీక్షకు హాజరయ్యాడు. అందులో ఆశించినంతగా పర్సెంటేజ్ రాలేదు. అయినప్పటికీ అమెరికాలోని వివిధ రాష్ట్రాల్లో వున్న యూనివర్సిటీలకు దరఖాస్తులు పెట్టాడు. రెండుమూడు యూనివర్సిటీల్లో సీట్లు వచ్చాయిగానీ, వాళ్ల ఆర్థికసహాయం లేదనీ, సొంత డబ్బుమీద చదువుకోవాలనీ కండిషన్ పెట్టారు. కాని వున్న కొంప కాస్తా అమ్మేసి, తల్లిదండ్రుల్ని వీధినపెట్టి తాను అమెరికా వెళ్ళదల్చుకోలేదు. అది సబబుగా తోచలేదు. 'అమెరికా వెళ్ళడం ఎట్లా!' అనే ఆలోచనలో పడ్డాడు కృష్ణప్రసాద్.

కృష్ణప్రసాద్ అందమైనవాడు. తండ్రికి ఒక్కడే కొడుకు. ఆరెకరాల పొలం వుంది. తెనాలి దగ్గర కంచెర్లపాలెం స్వగ్రామం. కాయకష్టం చేసుకొని బ్రతికే రాంకోటయ్యకు ఊళ్ళో 'పెద్దమనిషి'గా పేరుంది. అందుచేతనే వాళ్ళబ్బాయికి ఎన్నో సంబంధాలు గుమ్మందగ్గరకు వచ్చాయి. ఇద్దరు ముగ్గురు తొమ్మిదీ పది లక్షలదాకా కట్నం ఇస్తామని ముందుకువచ్చారు. రాంకోటయ్య దిమ్మతిరిగిపోయేంతగా ఆశ్చర్యపోయాడు. తనబ్బాయి చదివిన చదువు అంత గొప్పదా! అని వాపోయాడు. కాని కృష్ణప్రసాద్ పెళ్ళికి ససేమిరా ఒప్పుకోలేదు. తండ్రి చెప్పాడు. తల్లి చెప్పింది. ఇద్దరూ నయానా భయానా చెప్పిచూశారు. "నేను అమెరికా వెళ్లేవరకూ పెళ్ళిచేసుకోను" అని చెరుకుగడ నరికినంతగా ఖండితంగా చెప్పాడు. అమెరికా వెళ్ళిరావాలనేది కూడా ఓ రకమైన పిచ్చి కాబోలు!

అప్పుడే ఒక దినపత్రికలో 'వరుడు కావాలి' అనే ప్రకటనను చూశాడు కృష్ణప్రసాద్. అమెరికాలో కంప్యూటర్స్‌లో పనిచేస్తున్న ఒక పాతికేళ్ళ

యువతికి, ఎం.టెక్. చదివిన వరుడు కావాలి. దరఖాస్తు పెట్టాడు కృష్ణప్రసాద్ తండ్రికి తెలియకుండా. ఆ దరఖాస్తుతో పాటు తన ఫోటో పంపాడు. మూడో రోజు ఇంటర్వ్యూ వచ్చింది. ఆమె తెనాలిలో గంగానమ్మపేటలో మేనమామ ఇంట్లో దిగింది. మేనమామ ట్రాన్స్‌పోర్టు కాంట్రాక్టరు బాగా సంపాదించాడు.

ఆమె పేరు సునయన. తొమ్మిదో ఏటనే ఆమె అమెరికా వెళ్ళిందట. తండ్రి అక్కడ ఒక కెమికల్ కంపెనీలో ఇంజనీరు. బాగా సంపాదించాడు. కాని నాలుగేళ్ళక్రితమే కారు యాక్సిడెంట్‌లో పోయాడట. సునయన కంప్యూటర్ కోర్సు ట్రయినింగై, ఒక కంపెనీలో ఉద్యోగం చేస్తున్నది. ఆమె తల్లి, ఇద్దరు సోదరులూ అక్కడే వున్నారట. మేనమామ కబురంపగా పెళ్ళికోసమే తెనాలి వచ్చిందట. ఎంత త్వరగా పెళ్ళి అయితే అంత త్వరగా ఆమె అమెరికా వెళ్ళిపోయి, భర్తను రప్పించడానికి ప్రయత్నం చేస్తుందట.

ప్రథమ వీక్షణంలోనే సునయనకు కృష్ణప్రసాద్ నచ్చాడు. కృష్ణప్రసాద్‌కు కూడా సునయన నచ్చింది. అయితే తనకంటె ఆమె వయస్సు కాస్త ఎక్కువేమో అన్న అనుమానం అతనికి కలిగింది. అయినా సరిపెట్టుకున్నాడు– ఆమెను పెళ్ళిచేసుకుంటే తన జీవితాశయ, అంటే అమెరికా పోవడం నెరవేరుతుందని.

ఇంటర్‌వ్యూ అయిపోయాక పెళ్ళికి తన సుముఖతను తెలియజేసింది సునయన. ఎగిరి గంతేసినంత సంతోషాన్ని వెలిబుచ్చాడు కృష్ణప్రసాద్.

ఆ మరునాడు సాయంకాలమే ఎల్.ఆర్.ఎం క్లబ్బులో పురప్రముఖుల సమక్షాన దండలు మార్చుకొనే పెళ్ళి, తర్వాత లాంఛనంగా మేరేజి రిజిస్ట్రేషన్ రిజిస్ట్రార్ దగ్గరకెళ్ళి.

అమెరికా అమ్మాయితో పెళ్ళి అని కృష్ణప్రసాద్ తల్లిదండ్రులతో చెప్పాడు. వాళ్ళు ఇంత ఎత్తున ఎగిరిపడ్డారు. కులంలో మార్పు లేదన్నాడు; ఆమెకు లక్షడాలర్ల మేరకు ఆస్తి ఉందన్నాడు; తనని అమెరికా తీసుకెళ్ళి మంచి ఉద్యోగం ఇప్పిస్తుందని చెప్పాడు. అక్కడికీ వాళ్ళ ఆగ్రహం సద్దుమణగలేదు. పిల్ల గుణగణాలు, కుటుంబచరిత్ర, ఆచారాలు, సాంప్రదాయాలు – వీటిని గురించి అడిగారు. వాటిసంగతి తనకు తెలియదని నిర్వికారంగా చెప్పాడు కృష్ణప్రసాద్.

"పెళ్ళంటే నూరేళ్ళ పంట. అందులో ఏమాత్రం తొందరపడ్డా ఆ తర్వాత చచ్చేదాకా ఆఘోరిస్తూ కూచోవాలి" అన్నాడు రాంకోటయ్య హితబోధ చేస్తున్నట్టు.

"అన్ని విషయాలూ ఆలోచించే ఆమెను పెళ్ళిచేసుకోవడానికి నిర్ణయించుకున్నా" అన్నాడు కృష్ణప్రసాద్ దృఢంగా. ఆ తల్లిదండ్రులు మొహామొహాలు

చూసుకొని, అబ్బాయి చేయిదాటిపోయారనుకున్నారు.

సునయనతో కృష్ణప్రసాద్ పెళ్ళి జరిగిపోయింది.

పెళ్ళిజరిగిన మూడోరోజే హైద్రాబాద్‌నుంచి సునయన బొంబాయి మీదుగా అమెరికా వెళ్ళింది. ఒకటి రెండు నెలల్లో అతన్ని అమెరికా రప్పించ డానికి వర్యవన్నాహాలూ చేస్తానని మరీ మరీ చెప్పింది. అతను సంతృప్తిపడ్డాడు.

వారంరోజుల్లో సునయన దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. అందులో ఆమె కొన్ని కాగితాలు పంపించింది సంతకాలకోసం. సంతకాలు చేసి వెంటనే పంపిం చాడు కృష్ణప్రసాద్.

పెళ్ళయిన మూడోమాసంలో కృష్ణప్రసాద్ అమెరికా వెళ్ళాడు. న్యూయార్క్ ఎయిర్‌పోర్టులో అతన్ని రిసీవ్ చేసుకోవడానికి సునయన వచ్చింది. అమెతోపాటు ఆమె అన్నయ్య కూడా వచ్చాడు.

ఎయిర్‌పోర్ట్‌కు ముప్పైనాలుగు మైళ్ళ దూరంలో స్ట్రీట్ నెం. 42 మాన్ హాటన్‌లో సునయన ఇల్లు వుంది. క్రిజ్లర్ కారులో ఆమె సొంతంగా డ్రైవ్ చేసుకు వెళ్ళింది. అమె పక్కన కారులో కూర్చుని న్యూయార్క్ సిటీలోంచి వెళ్తుంటే స్వర్గంలో వున్నట్టుగా వుంది కృష్ణప్రసాద్‌కు. ఆ భూతలస్వర్గంలో తాను జీవించబోతున్నాడు అనే భావన రాగానే అతని వొళ్ళు సంతోషంతో గగు ర్పొడిచింది. ఇంటిదగ్గర కారు ఆపింది. ఆ ఇంటిముందు చిన్న లాన్ ఉంది. ఇల్లు చిన్నదైనా అందులో వున్న అధునిక పరికరాలు చూసి ముగ్ధుడయ్యాడు కృష్ణప్రసాద్. ఆ ఇంటిని సంవత్సరం క్రితమే సునయన కొన్నదట.

అమెరికా వెళ్ళడం, సునయనతో కాపురం చేయడం భూతల స్వర్గమని భావించిన కృష్ణప్రసాద్‌కు మూడోరోజున మొహంమీద కొత్తకారపు నీళ్ళు చల్లినట్లయింది. భర్త వచ్చిన సందర్భంగా ఫ్రెండ్స్‌కు చిన్న పార్టీ ఏర్పాటు చేసింది ఇంట్లో. ఆమె ఆఫీసులో పనిచేసేవాళ్ళట ముగ్గురు ఫ్రెండ్స్ వచ్చారు. అంతా ముప్పై ఏళ్ళలోపు మగవాళ్లే. పార్టీలో స్కాచ్ బాటిల్ ఓపెన్ చేశారు. కృష్ణప్రసాద్‌కు గ్లాసు అందించారు. అతను ఆముదం పుచ్చుకొన్న మొహం పెట్టాడు. అలవాటు లేదన్నాడు. 'అలవాటు చేసుకో డియర్' అంది సునయన. కషాయం పుచ్చుకున్నట్లు రెండుగుక్కలు గొంతులోకి జార్చాడు కృష్ణప్రసాద్.

వాళ్ళతోపాటు సునయన కూడా తాగింది. ఆశ్చర్యపోయాడు కృష్ణ ప్రసాద్. అది అమెరికన్ కల్చరేమో అనుకున్నాడు. వాళ్ళంతా బాటిల్ ఖాళీ చేశారు. రికార్డ్ మ్యూజిక్‌తో డ్యాన్సు చేశారు. తన కళ్ళముందే వాళ్ళు ముగ్గురూ విడివిడిగా, సమష్టిగా సునయనతో స్వేచ్ఛగా డ్యాన్సుచేయడం, ఆమె నడుం చుట్టూ చేతులువేయడం, అప్పుడప్పుడూ ఆ చేతుల్ని రొమ్ములకు తాకించడం,

ఆమె బుగ్గల్ని 'కిస్'చేయడం - కృష్ణప్రసాద్‌కు వొంటికి కొత్తకారం పులుముకున్నట్టుగా వుంది. పార్టీ అయిపోయాక తన అయిష్టతను తెలియజేశాడు ఆమెతో. "ఇది కంచెర్లపాలెం కాదు డియర్" అందామె. షాక్ తిన్నాడు కృష్ణప్రసాద్.

వారంరోజుల తర్వాత సునయన కడుపుతో వున్నట్టూ, నాలుగోమాసం నిండుతూన్నట్టూ తెల్సుకొని - భూమ్యాకాశాలు ఏకమైనంతగా తల్లకిందులయ్యాడు. పెళ్ళికి ముందే ఆమె గర్భవతి.

"ఇది అమెరికా డియర్" అంది సునయన సింపుల్‌గా.

అప్పుడుగానీ గ్రహించలేదు కృష్ణప్రసాద్. తాను అమెరికా అమ్మాయి మోజులో అగ్నిగుండంలో దిగినట్టు, ఆ క్షణంనుంచీ సునయనపై విరక్తి పుట్టింది; ఎంతో ఆగ్రహం వచ్చింది. కాని ఏం చేయగలడు? తాను భార్య ఆధారంతో బ్రతుకుతున్నాడు. ఉద్యోగం లేదు. సొంతంగా డబ్బు లేదు. విడిపోయి ఒకడే వుండలేడు.

వీక్‌ఎండ్స్‌కు ఎవరితోనో ఎక్కడికో వెళుతుంది సునయన. ఒక్కడే ఏకాంతంగా ఇంట్లో వుంటాడు కృష్ణప్రసాద్. పొద్దస్తమానం టి.వి. చూస్తూ ఆకలయినప్పుడు ఫ్రిజ్‌లో టిన్నుల్లోని ఫుడ్ తింటూ.

తొమ్మిదినెల్ల తర్వాత ఇండియా వచ్చాడు కృష్ణప్రసాద్-తండ్రి పొలాన పాముకర్చి చనిపోయాడని ఫోన్ వస్తే.

కృష్ణప్రసాద్ మళ్ళీ అమెరికా పోలేదు.

అక్కడ అమెరికాలో ఇద్దరు పిల్లల్ని కన్నది సునయన.

ఇక్కడ పొలం చూసుకుంటూ కాలక్షేపం చేస్తున్నాడు కృష్ణప్రసాద్. మనస్సులో సునయన మెదిలినప్పుడల్లా ఆగ్రహంతో అతని వొళ్ళు వేడెక్కిపోతూంటుంది.

మూడేళ్ళతర్వాత ఒక కేబుల్ వచ్చింది అమెరికానుంచి - ఒక కారు యాక్సిడెంట్‌లో సునయన కాళ్లు రెండూ దెబ్బతిన్నట్టు. ఆపరేషన్‌చేసి మోకాళ్ళకిందవరకూ తీసివేసినట్టు తర్వాత ఉత్తరం వచ్చింది. ఇన్సూరెన్స్ కంపెనీవారు లక్ష డాలర్లు చెల్లించారనీ, ఆర్థికపరమైన ఇబ్బందులేమీ లేవనీ, అమెరికా రావల్సిందనీ, తనని క్షమించమనీ, అమెరికాలో తాను పనిచేసిన కంపెనీలో ఉద్యోగం వస్తుందనీ భర్తకు సుదీర్ఘమైన లేఖ వ్రాసింది సునయన.

కాని కృష్ణప్రసాద్ అమెరికా వెళ్ళలేదు. కనీసం సునయన ఉత్తరానికి జవాబు కూడా ఇవ్వలేదు.

సునయన తర్వాత ఎన్నో ఉత్తరాలు వ్రాసింది- కన్నీళ్ళు కారుస్తూ.

ఏ ఉత్తరానికీ కృష్ణప్రసాద్ జవాబు రాయలేదు. అయితే అతను ఒంటరిగానే వుంటున్నాడు. మళ్ళీ పెళ్ళిచేసుకొనే ఉద్దేశం కూడా వున్నట్టులేదు.

*తొందరపడి పెళ్ళిచేసుకోవడం- జీవితాంతం తీరిగ్గా ఏడుస్తూవుండటం.*